క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: సీసీఎంబీ 11కేవీ ఫీడర్, ఐఐసిటి సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హబ్సిగూడ ట్రాన్స్‌కో ఏఈ ఎన్. రామిరెడ్డి తెలిపారు. వీఎస్‌టీ కాలనీ, భవానీనగర్, వీధి నంబర్–1 నుంచి 3 వరకు, రాజీవ్‌నగర్, శ్రీనగర్, నాచారం మెయిన్ రోడ్డు, హెచ్ఎంటీ నగర్ రోడ్ నంబర్–1 తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

హబ్సిగూడ వీధి నంబర్–8లో..

11కేవీ ఐఎస్ఐ ఫీడర్ మరమ్మతుల కారణంగా హబ్సిగూడ వీధి నంబర్–8 తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

నాచారంలో రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ ప్రారంభం



రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్

సాక్షి, సిటీబ్యూరో: నాణ్యమైన, అత్యంత విశిష్టమైన దుస్తులను అందజేస్తున్న రామ్‌రాజ్ కాటన్ 253వ షోరూమ్‌ను నాచారంలో ప్రారంభించారు. నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సాయిజెన్ శేఖర్ ప్రారంభించారు. రామ్‌రాజ్ కాటన్ ఫ్రాంచైజీ యజమాని ఎంఏ సలీమ్ అమీన్ మాట్లాడుతూ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టడంలో తాము దీర్ఘకాలంగా నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. దాంతో కస్టమర్లు తమను ఎప్పుడూ ఆదరిస్తూనే ఉన్నారని తెలిపారు.

ఆపదలో ఆపన్నహస్తం



ఆర్థిక సాయం అందజేస్తున్న జొౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, మహేష్‌గౌడ్

కుషాయిగూడ: ఆపదలో ఉన్నవారికి బీఎల్ఆర్ ట్రస్టు ఆపన్నహస్తం అందిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత జొౌండ్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అనారోగ్యానికి గురైన చర్లపల్లి డివిజన్‌వాసి ప్రహ్లాద్‌రెడ్డిని ఆస్పత్రిలో పరామర్శించిన ఆయన బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్‌తో కలిసి గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాభావంతో ఆపదలో ఉన్నవారికి చేయూత అందిస్తున్న బీఎల్ఆర్ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కడియాల బాబు, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా..



హెచ్‌బీకాలనీలో వార్డు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: వార్డు కార్యాలయాల ఏర్పాటుతో ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. హెచ్‌బీ కాలనీలో శుక్రవారం ప్రారంభం కానున్న వార్డు కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. నగరవ్యాప్తంగా 150 డివిజన్లలో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయడం గొప్ప పరిణామన్నారు. మెరుగైన సేవలందించడం కోసం ఏర్పాటు చేస్తున్న వార్డు కార్యాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పార్కులను అభివృద్ధి చేయండి



అల్వాల్ డీసీకి వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అల్వాల్: జొన్నబండ ప్రాంతంలోని ఎంహెచ్ఆర్ కాలనీ స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలని మచ్చబొల్లారం డివిజన్‌లోని శ్రీవెంకటేశ్వర ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. గురువారం అసోసియేషన్ ప్రతినిధులు సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్కిల్ డీసీ నాగమణికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు సుధీర్‌రెడ్డి, కాశీనాథ్‌గౌడ్, జీవన్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్స్ ఎప్పుడు..?

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 2,497 ప్రభుత్వ బడులు

- మొత్తం 3.64 లక్షల మంది విద్యార్థులు
- 15 రోజుల వ్యవధిలో పూర్తిస్థాయిలో అందజేసేలా..
- ఏకరూప దుస్తుల పంపిణీపై విద్యాశాఖ కసరత్తు
- 80 శాతం కుట్టడం పూర్తయినట్లు సమాచారం



సాక్షి, మేడ్చల్‌జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు జతల ఏకరూప దుస్తుల(యూనిఫామ్స్)ను అందిస్తోంది. గతేడాది బట్టల(క్లాత్)ను పాఠశాలలకు ఆలస్యంగా పంపడంతో వాటిని కుట్టించి విద్యార్థులకు అందజేయడానికి మరింత ఆలస్యమైంది. ఈ విద్యా సంవత్సరం అలాంటి జాప్యం జరగకుండా ప్రభుత్వం అప్రమత్తమైంది. పాఠశాలలు ప్రారంభం నుంచి మొదలుకొని 15 రోజుల వ్యవధిలో విద్యార్థులకు కొత్త దుస్తులను అందించాలని ముందస్తుగా ఏప్రిల్ నెలలోనే పాఠశాలలకు బట్టలను పంపిణీ చేసి కుట్టడానికి ఏజెన్సీలకు అందజేశారు.

ప్రతి సంవత్సరం రెండు జతలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఏటా రెండు జతల ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తోంది. 1 నుంచి 7వ తరగతి వరకు బాలురకు రెండు నిక్కర్లు, రెండు చొక్కాలు, 8 నుంచి 10వ తరగతి చదివే బాలురకు రెండు ప్యాంట్లు, రెండు చొక్కాలను, బాలికలకు రెండు జతల చుడీదార్ అందజేస్తారు. వేసవి సెలవులు ముగిసిన తర్వాత పాఠశాలల ప్రారంభం రోజున విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేయాలని విద్యాశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

- గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లో 3.64 లక్షల మంది విద్యార్థులు ఉండగా, ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున దుస్తులు పంపిణీ చేయాల్సి ఉంది. దుస్తులు కుట్టడానికి కావాల్సిన బట్టను ఏప్రిల్ నెల చివర్లో పాఠశాలలకు అందజేయగా, కుట్టడానికి ఏజెన్సీలకు అప్పగించారు. కాగా కుట్టాల్సిన దుస్తుల్లో ఇప్పటి వరకు 80 శాతం దుస్తులను కుట్టినట్లు తెలుస్తోంది. పూర్తయిన వాటిని పాఠశాలలకు తరలించి పంపిణీకి శ్రీకారం చుట్టారు. పాఠశాలలు ప్రారంభం నుంచి మొదలుకొని 15 రోజుల వ్యవధిలో పూర్తిస్థాయిలో దుస్తులను పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.
- హైదరాబాద్ సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

జిల్లా పేరు	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	631	1,08,635
మేడ్చల్–మల్కాజిగిరి	505	90,301
రంగారెడ్డి	1301	1,65,203
మొత్తం	2,497	3,64,139

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: సాయిమారుతీనగర్ కాలనీలోని సీతారామాంజనేయ స్వామి త్రయాహ్నిక ఏకకుండాత్మక ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఈ వేడుకలను నిర్వహించారు. గురువారం సేవాకాలం, బాలభోగం, శాంతిపాఠం, ద్వారాతోరణ పూజ, నిత్యహోమం, మూలమంత్ర మూర్తి మంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి, సామూహిక కుంకుమార్చన, చక్రస్నానం, సామూహిక విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, శ్రీపుష్ప యాగం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, 7వ డివిజన్ కార్పొరేటర్ కాటపల్లి లతా రాంచంద్రారెడ్డి, నేతలు దానగల్ల యాదగిరి, మోదుగు శేఖర్‌రెడ్డి, కాటపల్లి రాంచంద్రారెడ్డి, కొత్త చక్రపాణిగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో మంత్రి మల్లారెడ్డి తదితరులు

బాధితుడి వైద్యానికి ఆర్థిక సాయం



యువకుడిని పరామర్శిస్తున్న మాజీ మేయర్ బొంతు రాంమోహన్

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జమ్మిగడ్డవాసి సాయి యాదవ్‌ను గ్రేటర్ మేయర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్ పరామర్శించారు. లారీ ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలిసిన ఆయన శ్రీకర ఆసుపత్రిలో బాధితుడి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీనివాస్, పాండుగౌడ్ తదితరులు ఉన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

మల్లాపూర్: సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా జీహెచ్ఎంసీ ప్రతి డిపార్ట్‌మెంట్ నుంచి అధికారులు అందుబాటులో ఉంటూ పని చేస్తారని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు.

గురువారం నాచారం భవానీనగర్‌లో వార్డు కార్యాలయం ఏర్పాట్లను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, సుగుణాకర్‌రావు, సువర్ణ తదితరులు ఉన్నారు.



నాచారం భవానీనగర్ వార్డు కార్యాలయంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్

యూత్ డిక్లరేషన్ కరపత్రం ఆవిష్కరణ

ఉప్పల్: ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఏ– బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ నేతలు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా యూత్ డిక్లరేషన్ కరపత్రాన్ని రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూత్ డిక్లరేషన్‌పై ప్రజల్లో భరోసా కల్పించాలని సూచించారు. దీని వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను తెలుపుతూ విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని సూచించారు.



యూత్ డిక్లరేషన్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న రేవంత్‌రెడ్డి తదితరులు

నీటి కాలుష్యం, లో ప్రెషర్ ఉండదు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో తాగునీటి సమస్య, లో ప్రెషర్, కాలుష్యం బెడద ఉండదని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. గురువారం సీతారామ కాలనీలో ఓఆర్ఆర్ ఫేస్–2 తాగునీటి పైప్‌లైన్ పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ప్రతి ఇంటికీ సురక్షిత నీరు అందించడం బీఆర్ఎస్ లక్ష్యమన్నారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జలమండలి అధికారులు, స్థానికులు ఉన్నారు.



సీతారామకాలనీలో పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

సమస్యలను పరిష్కరించకుంటే సర్కిల్ ఆఫీసు ముట్టడిస్తాం



నాచారంలో సమస్యలను తెలుసుకుంటున్న రాగిడి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం రాఘవేంద్రనగర్, అన్నపూర్ణ కాలనీలోని సమస్యలను అధికారులు 10 రోజుల్లో పరిష్కరించకుంటే కాప్రా సర్కిల్ కార్యాలయాన్ని 500 మందితో ముట్టడిస్తామని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి హెచ్చరించారు. గురువారం నాచారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీలో గడప గడపకూ తిరిగి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 8 నెలలుగా కాలనీల్లో రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పైప్‌లైన్ల మరమ్మతుల కోసం పనులు చేపట్టి కాంట్రాక్టర్ మధ్యలో వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయనతో స్థానికులు మొర పెట్టుకున్నారు. అనంతరం ఆయన కాప్రా డీసీకి ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని, క్రాంటాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మైనార్టీస్ చైర్మన్ అబ్దుల్ రషీద్, అశ్రు, నాచారం కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడల మల్లికార్జున్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు రాంరెడ్డి, సంజయ్‌జైన్, సంతోష్, హెచ్ఆర్, మోహన్, నవీన్‌రెడ్డి, భద్రయ్య, ప్రభాకర్, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: సీఎం సహాయ నిధి అభాగ్యులకు అండగా నిలుస్తోందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు గురువారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతులమీదుగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఆపదలో ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, ముత్యంరెడ్డి, సంతోష్‌రెడ్డి, డాక్టర్ చారి, లక్ష్మీనారాయణ, నరేష్ ముదిరాజ్, శివ, శ్రీధర్, వెంకట్‌రెడ్డి, సాయి, రాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నాచురల్స్'లో అగ్ని ప్రమాదం

కాప్రా: ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లోని 'హెల్త్ అండ్ గ్లో'లో గురువారం రాత్రి 11 గంటలకు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెద్దఎత్తున పొగలు వ్యాపించడంతో వెంటనే స్థానికులు పోలీసులు, ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఫైర్ ఇంజిన్ సిబ్బంది షెట్టర్ పగలగొట్టారు. అంతలోనే పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. షాపులో కెమికల్స్ ఉండటంతో పాటు పరికరాల కారణంగా పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయని పలువురు తెలిపారు. గంటపాటు శ్రమించి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. నెల రోజుల క్రితమే ఫైర్ సేఫ్టీ లేదంటూ నోటీసులు కూడా అందజేశామని, అయినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ ప్రసాద్ తెలిపారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే ఆయన అక్కడకు చేరుకున్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



ఉప్పల్‌లో అభివృద్ధి శూన్యం

- నాలుగేళ్లుగా ఎక్కడి సమస్యలు అక్కడే..
- బీజేపీ హయాంలోనే రూ.650 కోట్ల నిధులు
- రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- బీజేపీ ఉప్పల్ అధికార ప్రతినిధి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలో నాలుగు సంవత్సరాలుగా అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయి ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని బీజేపీ ఉప్పల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఇల్లిట్టం నరసింహారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రగతినగర్‌లోని బీజేపీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో ఎమ్మెల్యేగా ఉన్న బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడిచిందని, రూ.650 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులతో పాటు చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులు ప్రారంభమై కొనసాగుతున్నాయన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గంలో తూతూమంత్రంగా చిన్న చిన్న అభివృద్ధి పనులు మాత్రమే చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మల్కాజిగిరిలో లోక్‌సభ నియోజకవర్గానికి ఎంపీగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు నియోజకవర్గంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మహేశ్వర్‌రెడ్డి, వెంకన్న, కృష్ణయ్య, బాలకృష్ణ, శ్రీనివాసరావు, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాల నిధులకు దరఖాస్తు చేసుకోవాలి

మల్కాజిగిరి: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వం నుంచి నిధులు పొందేందుకు దేవాలయాల నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీలోపు రెండు సెట్ల దరఖాస్తులు, దేవాలయం పేరున్న బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, దేవాలయం ఫొటో, దేవాలయం చైర్మన్ లేదా కార్యదర్శి ఆధార్ జిరాక్స్ జతపరిచి క్యాంప్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



అల్వాల్‌లో తనిఖీలు చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

అల్వాల్: బహుళ అంతస్తుల నిర్మాణాలతో పాటు ఇతర ప్రాంతాల్లో సెల్లార్లను కేవలం వాహనాల పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించాలని అల్వాల్ సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ అధికారి ఏసీపీ విజయశ్రీ సూచించారు. లేదంటే చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు సెల్లార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో వివిధ రకాల వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని వెంటనే ఖాళీ చేయాలని, ఈ వ్యాపారాలను ఇతర ప్రాంతాలకు మార్చుకోవాలని సూచించారు. ఇప్పటికే అల్వాల్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 11 సెల్లార్లను గుర్తించి రెడ్ నోటీసులను అందజేసినట్లు చెప్పారు. సదరు వ్యాపారులంతా వెంటనే సెల్లార్లను ఖాళీ చేయాలని సూచించారు. లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి రాజేందర్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డు పరిపాలనపై సమీక్ష

అల్వాల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వార్డు పరిపాలన వ్యవస్థకు సర్కిల్‌లో శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ నాగమణి తెలిపారు. ఈ మేరకు గురువారం వార్డు కార్యాలయాలకు సంబంధించిన పలు అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమీక్షించారు. సర్కిల్ పరిధిలోని 133వ డివిజన్, 134వ డివిజన్, 135వ డివిజన్‌లలో ఇప్పటికే వార్డు కార్యాలయాలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. నేటి నుంచి సర్కిల్‌కు సంబంధించిన పారిశుద్ధ్య, తాగునీరు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, యూసీడీ విభాగం వారు ప్రజలకు వార్డు స్థాయిలోనే అందుబాటులో ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ఈఈ రాజు, డీఈ ప్రశాంతి, వార్డు అధికారి స్వామి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అల్వాల్: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం అల్వాల్ ప్రాజెక్ట్ సీడీపీఓకు అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శోభారాణి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు 6 నెలలుగా బకాయి ఉన్నాయని, వెంటనే చెల్లించాలని కోరారు. పెన్నులు, పెన్సిల్స్, రబ్బర్, స్కేల్స్ వైట్ పేపర్స్ ప్రభుత్వం అందజేయాలని కోరారు. ఐసీడీఎస్‌తో సంబంధం లేని పనులు చేయించడం వలన ఐసీడీఎస్ పనులు పెండింగ్ పడుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



అల్వాల్ ప్రాజెక్ట్ ఐసీడీఎస్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఫెస్ట్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల

మేడిపల్లి: పర్వతాపూర్‌లోని అరోరా టెక్నాలజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కాలేజ్ స్టూడెంట్ యాక్టివిటీ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాలను కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లోని ప్రతిభ బయటకు వస్తుందని తెలిపారు. ఫెస్ట్ కన్వీనర్ శ్రావణ్‌కుమార్ రెడ్డి, కో కన్వీనర్ అనిల్ కుమార్, రాజేంద్ర, కళాశాలల అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలకృష్ణారెడ్డి, డాక్టర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.